సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం । 22 । సెప్టెంబర్ । 2023



కేరింత..!

విజయనగరం జిల్లా యువజనోత్సవాలు ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరిగాయి. వివిధ పోటీల్లో యువత ప్రతిభ చూపారు. - 8లో



సాంఘిక పరివర్తనకు రచనలతో ప్రయత్నం - 8లో

తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అని రచయిత లక్ష్మీనారాయణ అన్నారు.



ఇళ్లతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం

ఇళ్ల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లను కూడా కచ్చితంగా నిర్మించాలని గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

- డీసీహెచ్‌ఎస్ డాక్టర్ గౌరీశంకర్



విజయనగరం ఫోర్ట్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఈ నెల 30 నుంచి నిర్వహిస్తామని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ బి.గౌరీశంకర్ తెలిపారు. అక్టోబర్ 31వ తేదీ వరకు శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రతి శిబిరంలోను ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు, ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారన్నారు. జిల్లా వ్యాప్తంగా రోజుకు 30 వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయని చెప్పారు. 100 మంది వైద్యులు సేవలందిస్తారని తెలిపారు. జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనిక్, ఆర్థో, ఈఎన్‌టీ విభాగాలకు చెందినవారు వైద్య సేవలు అందిస్తారన్నారు.

మాస్టర్ అథ్లెట్‌కు ఎస్పీ అభినందన



సన్యాసినాయుడిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో పోల్‌వాల్ట్ విభాగంలో రజతపతకం సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ పి.సన్యాసినాయుడును ఎస్పీ ఎం.దీపిక తన కార్యాలయంలో గురువారం అభినందించారు. గతనెల 19 నుంచి 21వ తేదీ వరకు శ్రీలంక దేశంలోని దియగమ మహేంద్ర రాజపక్సే స్టేడియంలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో సన్యాసినాయుడు ప్రతిభ చూపారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ యూనివర్స్, ఆర్ఐలు రమణమూర్తి, ఎస్.గోపాలనాయుడు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ఆపన్న హస్తం



చెక్కును అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: మానసిక దివ్యాంగురాలి వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయల సాయం అందింది. పూసపాటిరేగ మండలం చోడమ్మ అగ్రహారం గ్రామానికి చెందిన గుడివాడ సత్యవతి తమ కుమార్తెకు మానసిక వైద్యం కోసం ఆర్థిక సహాయం అందించాలని ఇటీవల మరడాం పర్యటనలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సీఎం రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించి మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కును లబ్ధిదారు సత్యవతికి కలెక్టర్ నాగలక్ష్మి గురువారం అందజేశారు.

వ్యాన్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తగరపువలస: భీమిలి మండలం బోడమెట్టపాలెం జాతీయ రహదారిపై గోకులం ఆశ్రమం వద్ద గురువారం ఆర్టీసీ బస్సు వ్యాన్‌ను ఢీకొన్న ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. విజయనగరం నుంచి తగరపువలస వైపు వస్తున్న వ్యాన్ వెనుక ఆర్టీసీ బస్సు వస్తోంది. ఆశ్రమం సమీపంలో కుక్కను తప్పించబోయి వ్యాన్ నెమ్మదించడంతో.. వెనుకనే వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఆకస్మాత్తుగా బ్రేకులు వేసి వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మన్యం పార్వతీపురం జిల్లా కొమరాడకు చెందిన వారాడ శ్రీనివాసరావు నోటికి తీవ్రగాయాలై దంతాలు ఊడిపోయాయి. ఇదే ప్రమాదంలో ఆయన భార్యతో పాటు ఎస్.కుమారి, గొలగాని నీలవేణితో పాటు మరికొందరు గాయపడ్డారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ తాతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి

విజయనగరం అర్బన్: జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియ తుదిదశకు చేరింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తం 1,847 పోలింగ్ కేంద్రాలు ఖరారయ్యాయి. ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండడం వల్ల రాజాం నియోజకవర్గంలోని కేవలం ఒక్క పోలింగ్ కేంద్రం రద్దు కానుంది. 49 పోలింగ్ కేంద్రాల స్థానాలు మారనున్నాయని కలెక్టర్ నాగలక్ష్మి స్పష్టం చేశారు. అభ్యంతరాలు ఉంటే శుక్రవారం నాటికి తెలియజేయాలని కోరారు.

బీమా భరోసా



- ఆపన్నులకు ఆర్థిక భద్రత
- వైఎస్సార్ బీమాతో పేదలకు ధీమా
- రూపాయి ప్రీమియం వసూలు చేయకుండానే పథకం వర్తింపు
- జిల్లాలో ప్రారంభమైన బీమా సర్వే ప్రక్రియ
- 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు బీపీఎల్ కుటుంబాలు అర్హులు
- జిల్లాలో 2.62 లక్షల మందికి బీమా వర్తించేలా చర్యలు

పార్వతీపురంటౌన్: పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోంది. బలహీన వర్గాలకు సంక్షేమాన్ని దరిజేర్చే క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా వెనుకడుగు వేయడంలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం లేకున్నా పథకాలను కొనసాగిస్తోంది. దీనికి 'వైఎస్సార్‌బీమా'యే నిలువెత్తు నిదర్శనం. కంపెనీలు ప్రీమియం పెంచేసినా వెరవకుండా సొంతంగా బీమా పథకాన్ని తీసుకొచ్చి ఆపన్నులకు అండగా నిలుస్తోంది. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి శోకసంద్రంలో మునిగిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. దేశంలో ఏ రాష్ట్రమూ అమలు చేయని రీతిలో ఉచిత బీమా పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో బీమా పథకం అమలుకు కేంద్ర ప్రభుత్వం తన వంతుగా 60 శాతం నిధులు ఇస్తే, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం సమకూర్చేది. 2020 ఏప్రిల్‌లో కేంద్ర ప్రభుత్వం పథకం నుంచి తప్పుకుంది. ఈ క్రమంలో పథకం అమలును రాష్ట్ర ప్రభుత్వం తన భుజాల మీద వేసుకుంది. తాజాగా బీమా కంపెనీలు సైతం చేతులెత్తేశాయి. అయినా, ఖర్చుకు వెనకాడకుండా పరిహారం నేరుగా చెల్లించేలా కార్యాచరణ ప్రారంభించింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో 2019–20 ఆర్థిక సంవత్సరం నుంచి 2021–22 వరకు మూడు ఆర్థిక సంవత్సరాల కాలంలో 4,391 మందికి బీమా పథకం వర్తించింది. ఆయా కుటుంబాలకు ఆర్థిక సాయం అందింది.



పార్వతీపురం పట్టణం 30వ వార్డులో బీమా నమోదు చేస్తున్న వలంటీర్ వి.తరుణ్ కుమార్, సచివాలయ సిబ్బంది సాంబమూర్తి

బీమా వర్తింపు ఇలా..

కుటుంబ పెద్ద సహజ మరణం పొందినా లేదంటే ప్రమాదవశాత్తు మరణించినా పరిహారం పొందేలా పథకాన్ని ప్రభుత్వం రూపకల్పన చేసింది. 18 నుంచి 50 ఏళ్ల వ్యక్తి సహజంగా మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.లక్ష చెల్లిస్తుంది. 18 నుంచి 70 ఏళ్ల వయసులో ఉన్నవారు ప్రమాదంలో మరణించినా లేదంటే అంగవైకల్యం సంభవించినా రూ.5 లక్షల వరకూ అందుతుంది. బీమా మొత్తం బ్యాంకు అకౌంట్లలో జమ అవుతుంది. క్లెయిమ్ చేసిన 15 రోజుల్లో డబ్బులు వస్తాయి. లబ్ధిదారుడి కుటుంబానికి తక్షణ ఉపశమనం కింద రూ.10 వేల ఆర్థిక సాయం అందుతుంది. పేదలు, అసంఘటిత కార్మిక కుటుంబాలపై భారం పడకుండా ప్రభుత్వమే బీమా ప్రీమియం ఖర్చు భరిస్తోంది. ప్రస్తుతం వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించి సర్వే కొనసాగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం 2,58,702 మందికి బీమా వర్తించేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

జిల్లాలో బీమా లబ్ధిదారులు ఇలా...

మండలం	లబ్ధిదారుల సంఖ్య
బలిజిపేట	17,611
భామిని	12,906
గరుగుబిల్లి	12,763
గుమ్మలక్ష్మీపురం	12,763
జియ్యమ్మవలస	15,230
కొమరాడ	15,343
కురుపాం	13,483
మక్కువ	14,483
పాచిపెంట	14,300
పాలకొండ	12,909
పాలకొండ అర్బన్	7,368
పార్వతీపురం	17,637
పార్వతీపురం అర్బన్	11,373
సాలూరు	17,077
సాలూరు అర్బన్	12,862
సీతంపేట	15,502
సీతానగరం	16,680
వీరఘట్టం	18,262

అర్హులు ఎవరంటే

18 ఏళ్ల నించి 70 ఏళ్లలోపు వయసు ఉండాలి. బీపీఎల్ కుటుంబానికి చెంది ఉండాలి. తప్పనిసరిగా తెలుపు రేషన్ కార్డు కలిగి ఉండాలి. కుటుంబంలో ప్రాథమికంగా సంపాదించే వ్యక్తి అయి ఉండాలి.

కుటుంబ పెద్ద పేరున పాలసీ



కుటుంబానికి ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉండే వ్యక్తి పేరున బీమా పాలసీ తీసుకోవాలి. ఆ వ్యక్తికి ఏదైనా ప్రమాదం జరిగితే బీమా ద్వారా అందే సొమ్ము కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పిస్తుంది. వలంటీర్లు కూడా కుటుంబ పోషకుడి పేరునే పాలసీ ఇవ్వాలి.

– పి.కిరణ్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

చదువుకు చక్కని ప్రాధాన్యం



గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంతనాయక్

- ఏకలవ్య పాఠశాలను సందర్శించిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం చదువుకు చక్కని ప్రాధాన్యమిస్తోందని, అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించాలని జాతీయ ఎస్టీకమిషన్ సభ్యుడు అనంతనాయక్ సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తెలుసుకుని సంతోషం వ్యక్తంచేశారు. చక్కని మెనూ, నాడు–నేడు తో సర్కారు బడులకు ఆధునిక సదుపాయాల కల్పన, వివిధ పథకాలతో విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటునందించడం బాగుందన్నారు. విద్యావకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. ముందుకు ఏకలవ్య పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. కొండ ప్రాంతాల్లో ఏర్పాటుచేస్తున్న 4జి సెల్ టవర్స్‌ను సూచిస్తూ ఏర్పాటుచేసిన స్టాల్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్, డీడీ కె.శ్రీనివాసరావు, వైకేపీ ఏపీడీ సత్యనారాయణ, ఎంఈఓలు చంద్రశేఖర్, జనార్దనరావు, ఏటీడబ్ల్యూఓ సురేష్‌కుమార్, ఎంపీడీఓ సాల్మన్ రాజ్, తహసీల్దార్ జె.రాములమ్మ, తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన భద్రగిరి సీహెచ్‌సీని సందర్శించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు.



పార్వతీపురం: ఎస్టీ కమిషన్ సభ్యుడితో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్, అధికారులు

సాదర స్వాగతం

పార్వతీపురం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు అనంత నాయక్‌కు కలెక్టర్ నిషాంత్‌కుమార్ గురువారం ఉదయం గరుగుబిల్లి మండలంలోని ఉల్లిబద్రలోగల గెస్ట్ హౌస్‌లో పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. గిరిజన ప్రాంతాల్లో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, ఆర్డీఓ కె.హేమలత తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యం


- ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి

గంట్యాడ/బొండపల్లి: విద్యార్థుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఉపాధ్యాయుడు బోధన సాగించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందిపుచ్చుకోవాలని ఆర్‌జేడీ ఎం.జ్యోతికుమారి సూచించారు. గంట్యాడ ఎంఈఓ కార్యాలయం, బొండపల్లి మండలం గొట్లాం జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ఆయా మండలాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. నోట్ బుక్స్, వర్క్ బుక్స్ కరెక్షన్స్‌ను ప్రతి ఉపాధ్యాయుడు పూర్తి చేయాలన్నారు. మనబడి నాడు–నేడు కింద పాఠశాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యాప్రణాళికను పక్కాగా అమలుచేయాలన్నారు. ప్రతి విద్యార్థి అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. టోఫెల్ పరీక్షలు విధిగా నిర్వహించాలని సూచించారు. 100 శాతం జీఈఆర్ సర్వేను వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్ల సహాయంతో పూర్తి చేయాలని సూచించారు. పదోతరగతి ఫెయిలైన విద్యార్థులను పాఠశాలలో చేర్పించుకోవాలన్నారు. బైజూస్ ట్యాబ్‌లలో ఎలాంటి సాంకేతిక సమస్యలు వచ్చినా సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. సమావేశంలో డీసీఈబీ కార్యదర్శి టి.సన్యాసిరాజు, మండల విద్యాశాఖ అధికారులు విజయకుమారి, వెంకటరావు, శోభారాణి, అల్లు వెంకటరమణ, హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ జ్యోతి కుమారి

పెరిగిన వంశధార



నిండుగా ప్రవహిస్తున్న వంశధార నది

భామిని: ఒడిశాలో కురుస్తున్న వర్షాలతో వంశధార నదికి వరద తాకిడి పెరిగింది. నదిలో గురువారం 50 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు నిర్ధారించారు. నదిలో వరద పెరగడంతో ఆంధ్రా–ఒడిశా గ్రామాలను అనుసంధానం చేసే నాటు పడవల ప్రయాణం నిలిచిపోయింది. కాట్రగడ–బి వద్ద ఓపెన్ హెడ్ చానల్ నిండుగా ప్రవహిస్తోంది. సైడ్ వియ్యర్‌లో సుమారు 5వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిమ్మిడిజోల, పసుకుడి, బిల్లుమడ, సొలికిరి, బాలేరు, కీసర, ఘనసర, కోసలిలోని తంపర భూముల్లోకి వరదనీరు ముంచెత్తింది.

గురజాడ నడయాడిన నేలపై జన్మించడం
మన అదృష్టం

- భావితరాలకు గురజాడ స్ఫూర్తిని అందిద్దాం
- జెడ్పీ నిధులతో గురజాడ గృహం అభివృద్ధి: జెడ్పీచైర్మన్
- గురజాడ రచనలు అజరామరం: కలెక్టర్ నాగలక్ష్మి
- మహాకవికి నివాళులర్పించిన సాహితీ వేత్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు



గురజాడ దేశభక్తిగీతాలను ప్లకార్డుల రూపంలో ప్రదర్శిస్తున్న విద్యార్థులు



గురజాడ గృహంలో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్‌అశోక్ తదితరులు

విజయనగరం టౌన్: గురజాడ నడయాడిన నేలపై జన్మించడం మన అదృష్టమని, గురజాడ స్ఫూర్తిని భావితరాలకు అందిద్దామని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. గురజాడ 161వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, గురజాడ కుటుంబ సభ్యులు ప్రసాద్, ఇందిరలతో కలిసి గురజాడ స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలేసి, జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం గురజాడ ఇంటి మేడపై ఉన్న ఆయన వినియోగించిన వస్తువులను పరిశీలించారు. గురజాడ ఇంట్లో ఏర్పాటుచేసిన లైబ్రరీలో మౌలిక వసతులను పరిశీలించారు. జీహెచ్‌వీ ఏర్పాటుచేసిన వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారంభించారు. అనంతరం గురజాడ రచించిన దేశమంటే మట్టి కాదోయ్.. గేయాన్ని ఆలపిస్తూ పెద్ద సంఖ్యలో విద్యార్థులతో కలిసి గురజాడ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ గురజాడ స్ఫూర్తితో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి కృషిచేస్తోందన్నారు. అన్నివర్గాల అభివృద్ధికి పాటుపడుతోందని తెలిపారు. తన రచనలతో దేశభక్తిని పెంపొందించిన గొప్పకవి గురజాడ అని, ఇటీవల దేశప్రధాని మోదీ నోట గురజాడ మాటలు వినిపించాయని గుర్తుచేశారు. అనేక మంది సందర్శకులు ఇక్కడి గ్రంథాలయానికి వస్తున్న దృష్ట్యా మౌలిక వసతుల కల్పనకు జెడ్పీ నిధులను సమకూర్చతామని తెలిపారు. దీనికోసం ఒక కమిటీని ఏర్పాటుచేసి, అవసరమైన సౌకర్యాలను గుర్తించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ గురజాడ చిరస్మరణీయులని, వారి రచనలు ఎన్నితరాలకైనా అనుసరణీయాలన్నారు. ఎప్పటికీ నిలిచి ఉంటాయని తెలిపారు. గురజాడ గృహాన్ని ఇటీవలే పెయింటింగ్స్ వేయించి, కొంతమేర అభివృద్ధిచేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. గురజాడ గృహంలో గురజాడ వినియోగించిన వస్తువులను, గురజాడ స్టాంప్‌ను చేతిరాతలను, కళ్లద్దాలను, గురజాడ సేకరించిన పుస్తకాలను, ఎగ్జిబిషన్ రూమ్‌లో గురజాడ సమకాలీన కవులు, మేధావుల చిత్రపటాలను చైర్మన్, కలెక్టర్ సందర్శించి విజిటర్స్ రికార్డ్‌లో సంతకాలు చేసి గురజాడ గృహాన్ని సందర్శించినందుకు గర్వంగా ఉందని రాశారు. కార్యక్రమంలో నగర మేయర్ విజయలక్ష్మి, సహాయ కలెక్టర్ వెంకట త్రివినాగ్, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములనాయుడు, జిల్లా పర్యాటక అధికారి లక్ష్మీనారాయణ, డీపీఆర్‌ఓ డి.రమేష్, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, గురజాడ సమాఖ్య ప్రతినిధులు కాపుగంటి ప్రకాష్, డాక్టర్ ఎ.గోపాలరావు, భోగరాజు సూర్యలక్ష్మి, కృష్ణాజీ, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



గురజాడ వినియోగించిన వస్తువులతో ర్యాలీగా వెళ్తున్న జెడ్పీ చైర్మన్, కలెక్టర్, జేసీ, గురజాడ కుటుంబ సభ్యులు

జేఎన్‌టీయూ జీవీలో గురజాడ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో మహాకవి గురజాడ అప్పారావు 161వ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం), యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 'ఈ తరం కోసం కవితా స్రవంతి' అనే కార్యక్రమంలో భాగంగా అరసం ముద్రించిన గురజాడ కవితా సంకలనాన్ని వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ గురజాడ రెండు శతాబ్దాల ముందుచూపు కలిగిన గొప్పదార్శనికుడని, ఆయన సాహిత్యం నేటి తరానికి గొప్ప స్ఫూర్తినిస్తుందన్నారు. విద్యార్థులందరూ ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని కోరారు. అరసం జాతీయ అధ్యక్షుడు పెగుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గురజాడ స్త్రీల సమస్యలపై మంచి సాహిత్యాన్ని రచించారని, స్త్రీల శ్రమశక్తి వంటింటిలో నిర్వీర్యం అయిపోతుందని, వంటిల్లు నిషేధించాలని గురజాడ పేర్కొన్నారని తెలియజేశారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, కార్యదర్శి శరత్‌చంద్ర జ్యోతి, జిల్లా అధ్యక్షుడు జీఎస్‌చలం మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషలో చదువులు కొనసాగించడానికి గురజాడ చేసిన కృషిని తెలియజేశారు. వర్సిటీ పరిధిలోని 33 కళాశాల విద్యార్థులకు నిర్వహించిన కవితల పోటీల్లో ఆంగ్లం విభాగంలో సంధ్యా జాగరపు, సంజనా వర్మ, వైష్ణవి గుప్త, తెలుగు విభాగంలో దేబార్కి మణి కంఠ, జాజుల లావణ్య విజేతలుగా నిలిచారు. వీరికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ బహుమతులను ప్రదానం చేశారు. అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ బి.నళిని, వివిధ విభాగాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: వైద్యారోగ్యశాఖ పరిధిలోని లంకాపట్నం యూపీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు-1, ఎస్ఎన్‌సీయూలో సపోర్టింగ్ స్టాఫ్ పోస్టు-1 ఖాళీలు ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్. భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుకు ఈడబ్ల్యూఎస్ మహిళ, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టుకు ఓసీ-మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. ఈనెల 26 వతేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. విద్యార్హతలు, వయస్సుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల కాపీలపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించాలని పేర్కొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనూరాధ

పార్వతీపురంటౌన్: కొమరాడ మండలంలోని రావికోన గ్రామంలో బుధవారం రాత్రి ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయన్నినికి పాల్పడింది. ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన తోయక అనూరాధ గృహిణి. ఆమె భర్త త్రినాథ వ్యవసాయ కూలీ. బుధవారం రాత్రి త్రినాథ పని చేసుకుని ఇంటికి వచ్చేసరికి భార్య పడిపోయి ఉండడం గమనించి స్థానిక పీహెచ్‌సీకి తరలించగా వైద్యులు పరీక్షించి పురుగు మందు తాగిందని తెలిపారు. పరిస్థితి విషమించడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతోంది. అస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూనికలు, కొలతల శాఖ తనిఖీలు


ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లు సరిచూస్తున్న ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ

సంతకవిటి: మండల కేంద్రంలోని వినాయక రైస్‌మిల్‌లో తూనికలు కొలతల శాఖ గురువారం క్యాంప్ నిర్వహించి వ్యాపారస్తుల ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లు సరిచూసి ముద్రలు వేసింది. ఈ సందర్భంగా ఆ శాఖ బొబ్బిలి ఇన్‌స్పెక్టర్ ఎ.బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రతి వ్యాపారస్తుడు సంవత్సరానికి ఒకసారి వేయింగ్ మెషీన్‌లపై ముద్రలు వేయించుకోవాలని, ఎవరైనా వ్యాపారస్తులు ముద్రలు లేకుండా ఎలక్ట్రానిక్ వేయింగ్ మెషీన్‌లు ఉపయోగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో తూనికలు కొలతలు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులమంటూ దౌర్జన్యం

సాలూరు: మండలంలోని కొదమ పంచాయతీ కోడంగివలస గ్రామంలో గుర్తు తెలియని కొందరు దుండగులు పోలీసులమంటూ దౌర్జన్యానికి పాల్పడి, గిరిజనుల ఇళ్లలో చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కోడంగివలస గ్రామంలో రాత్రి తొమ్మిది గంటల సమయంలో నలుగురు వ్యక్తులు ముసుగులు వేసుకుని చొరబడి, తాము పోలీసులమంటూ తెలుగు, హిందీ, ఒడియా భాషల్లో మాట్లాడుతూ మగవారిపై కర్రలతో దాడిచేసి భయానక వాతావరణం సృష్టించారు. అనంతరం చోడిపిల్లి సుకిల దగ్గర రూ.20వేల నగదుతో పాటు సుమారు రూ.లక్ష విలువైన 18 గ్రాముల పుస్తెలతాడు, చోడిపిల్లి బొందురు నుంచి రూ. 20వేల నగదుతో పాటు సుమారు రూ.35వేలు విలువ చేసే ఆరు గ్రాముల బంగారం, చోడిపిల్లి చిన్నమ్మి నుంచి పుస్తెలతాడుతో పాటు రూ.20వేల నగదు ఎత్తుకెళ్లారు. దీనిపై బాధితులు గురువారం సాయంత్రం సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రయోగమూర్తి తెలిపారు.

కేరింత..!


స్వామి వివేకానంద, మహాకవి గురజాడ చిత్రపటాల వద్ద అంజలి ఘటిస్తున్న అతిథులు





- ఉల్లాసంగా జిల్లా యువజనోత్సవం
- భాగస్వామ్యమైన యువత, అధికారులు, ప్రముఖులు
- 15 అంశాల్లో పోటీలకు హాజరైన 500 మంది యువత

విజయనగరం: ఈ ఏడాది(2023-24) విజయనగరం జిల్లా యువజనోత్సవాలు ఉల్లాసంగా..ఉత్సాహంగా జరిగాయి. స్థానిక సీతం కళాశాల వేదికగా ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సవాలు గురువారం నిర్వహించారు. సెట్విజ్, నెహ్రూ యువ కేంద్ర, సీతం కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవాల్లో సెట్విజ్ సీఈవో బి.రామగోపాల్, జిల్లా యువజన అధికారి వెంకట్ ఉజ్వల్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈశ్వర్ కౌశిక్, సీతం కళాశాల డైరెక్టర్ ఎం. శశిభూషణ రావు, ప్రిన్సిపాల్ రమణ మూర్తి, బ్రహ్మ కుమారి అన్నపూర్ణ, మెప్మా పీడీ సుధాకర్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గోవిందరావు, అడల్ట్ ఎడ్యుకేషన్ డీడీ సోమేశ్వరరావు, సంగీత కళాశాల అధ్యాపకురాలు బిందు తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం స్వామి వివేకానంద, గురజాడ చిత్రపటాలకు పూలమాలలు వేసి యువజనోత్సవాలను ప్రారంభించారు. జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 500 మంది విద్యార్థులు


జిల్లా స్థాయి యువజనోత్సవాలకు హాజరైన యువత

హాజరై వివిధ పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కళా వైభవం, జీవిత నైపుణ్యం, శారీరక, మానసిక ఆరోగ్యం ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ వివిధ ప్రదర్శనలు నిర్వహించారు. సెట్విజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 15 అంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించగా యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం తపించాలి

ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన అతిథులంతా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ బలమైన లక్ష్యం ఏర్పాటు చేసుకుని సాధన కోసం నిరంతరం తపించాలని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆశయ సాధన కోసం అకుంఠిత దీక్ష, ఏకాగ్రత చాలా అవసరమని పేర్కొన్నారు. పోటీతత్వం అలవర్చుకోవాలని, మానసిక ధైర్యంతో ముందుకు వెళ్లాలని హితవు


యువజనోత్సవాల్లో యువత ప్రదర్శనలు

పలికారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక చైతన్యం పొందడానికి అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకోవాలని, క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. మంచి పనుల కోసం యువత తమ శక్తిని, జ్ఞానాన్ని ఉపయోగించాలని, చెడుకు దూరంగా ఉండాలని హితవు పలికారు.

ఆకట్టుకున్న ఆహార పదార్థాల ప్రదర్శన

జిల్లా యువజనోత్సవ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శనలో ఉంచగా అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. సీతం కళాశాల అధ్యాపకులు, సెట్విజ్, యువజన సర్వీసుల శాఖ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో డిప్యూటీ స్పీకర్

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన వీరభద్రస్వామిని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు సాదరంగా స్వాగతం పలకగా, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. చైర్మన్ రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.


డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ చైర్మన్ రాంబాబు

సాంఘిక పరివర్తనకు రచనలతో ప్రయత్నం

- అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ

విజయనగరం అర్బన్: తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి గురజాడ అని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు స్థానిక గురజాడ పాఠశాలలో గురువారం జరిగిన గురజాడ జయంతి ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ చాలా రచనలు చేసినప్పటికీ సమాజంలో మార్పు కోరుతూ రాసిన కన్యాశుల్కం నాటకం పేరుగాంచిందన్నారు. నేటి విద్యార్థులు గురజాడ అప్పారావును ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన కవితాస్రవంతి పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ఎంవీకృష్ణాజీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, కార్యదర్శి శరత్ చంద్రజ్యోతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జీఎస్‌చలం, ఆర్.బాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడిశేఖర్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో అరసం జాతీయ ప్రధాన కార్యదర్శి పెనుగొండ లక్ష్మీ నారాయణ, తదితరులు

కొనసాగుతున్న పౌల్ట్రీ కార్మికుల దీక్ష

- రెండు వారాలుగా నిరసన
- పట్టించుకోని యాజమాన్యం

చీపురుపల్లి: రేయింబవళ్లు పనిచేస్తున్నారు. యాజమాన్యం చెప్పిన ప్రతి పనీ చేస్తున్నారు. విధి నిర్వహణే పరమావధిగా పనులు నిర్వహిస్తున్నారు. కష్టానికి తగ్గట్టుగా వేతనాలు పెంచండి మహాప్రభో అంటూ కార్మికులు కోరుతుంటే యాజమాన్యం ససేమిరా అంటోంది. ఇదీ మండలంలోని కర్లాం పరిసరాల్లో గల శ్రీ వెంకటరామా పౌల్ట్రీస్ పరిశ్రమలో కార్మికుల పరిస్థితి. ఆ పరిశ్రమ కార్మికులు తమకు పనికి తగ్గ వేతనాలు పెంచాలని కోరుతూ రెండు వారాలుగా పరిశ్రమ ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. విధులు బహిష్కరించి నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ పరిశ్రమ యాజమాన్యం స్పందించడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీ వెంకటరామా పౌల్ట్రీస్ పరిశ్రమలో ఈ ప్రాంతానికి చెందిన 170 మంది విధులు నిర్వహిస్తున్నారు. స్థానికేతరులైన ఒడిశా ప్రాంతానికి చెందిన కార్మికులు చాలామంది పరిశ్రమలో ఉన్నారు.


పౌల్ట్రీస్ పరిశ్రమ ఎదుట నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

ఇళ్లతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం

- గృహనిర్మాణశాఖ పీడీ డి. శ్రీనివాసరావు
- మెరకముడిదాంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష



గృహనిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న పీడీ శ్రీనివాస్

మెరకముడిదాం: ఇళ్ల నిర్మాణంతో పాటు మరుగుదొడ్లను కూడా కచ్చితంగా నిర్మించాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన గృహనిర్మాణాలపై మెరకముడిదాం మండల ఏఈ, సిబ్బందితో పాటు సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా మండలంలో ఇంతవరకూ మంజూరైన ఇళ్లు ఎన్ని? నిర్మాణాలు పూర్తయినవి ఎన్ని? పూర్తి కావాల్సినవి ఎన్ని? అని ప్రశ్నించారు. దీనికి ఏఈ సమాధానమిస్తూ మండలానికి సంబంధించి 1972 ఇళ్లు మంజూరు కాగా అందులో 1462 నిర్మాణం పూర్తయిందని, ఇంకా 171 ఇళ్ల నిర్మాణం పునాదుల లెవెల్‌వరకూ జరిగిందని, శ్లాబ్ లెవెల్ వరకూ 119 కాగా శ్లాబ్ పూర్తయినవి 87 ఉన్నాయని, నిర్మాణం ప్రారంభం ఇళ్లు 133 ఉన్నాయని తెలిపారు. అలాగే 23 జగనన్న లేఅవుట్లలో 669 ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారా? అని ఏఈని పీడీ ప్రశ్నించగా లబ్ధిదారులు మరుగుదొడ్లు నిర్మిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో గృహనిర్మాణశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శ్రీనివాసన్, డిప్యూటీ ఇంజినీర్ జి.మురళీమోహన్, ఎంపీడీఓ ఎం.రత్నం, ఉపాధి ఏపీఓ ఎస్.పెదప్పలనాయుడు, మండలానికి చెందిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

రాజాం సిటీ: మండల పరిధి మొగిలివలస జంక్షన్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంతకాపల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ నేదూరు కొండలరావు (36) మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గురువారం వేకువజామున పొందూరులో కూరగాయల లోడు వేసుకుని రాజాం మార్కెట్‌లో కొండలరావు దించాడు. అనంతరం స్వగ్రామం తిరిగి వెళ్తుండగా శ్రీకాకుళం నుంచి వస్తున్న లారీ ఆటోను బలంగా ఢీకొంది. దీంతో ఆటో ముందు అద్దం పగిలిపోయి డ్రైవర్ రోడ్డుపై పడిపోగా బలమైనగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐ కె.రవికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

మహిళలకు రిజర్వేషన్‌పై హర్షం

విజయనగరం: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదం తెలపడంపై మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 50 శాతానికి పైగా స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు మహిళలకు కల్పించి దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. పార్లమెంటు సభ్యురాలిగా తాను 2012లో మహిళలకు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ అధీన రంగంలో నడిచే కార్పొరేషన్లు, బ్యాంకుల్లో ఉద్యోగాలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని లోక్‌సభలో ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టానని చెప్పారు. కుటుంబ బరువు బాధ్యతలతో భారత్‌లో మహిళలు విద్య, ఉద్యోగాలపై పూర్తి దృష్టి సారించలేరని, అందువల్ల కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని అన్ని ఉద్యోగాలలోనూ 33 శాతం ఉద్యోగాలను రిజర్వ్ చేయాలని అప్పట్లో కోరినట్లు ఆమె చెప్పారు. తాను పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నప్పుడు 2010లో మహిళా బిల్లు పార్లమెంటు ముంగిటకు వచ్చినా పాస్ కాలేదన్నారు. 2010 లో రాజ్యసభ దీనిని ఆమోదించిందని గుర్తు చేశారు. ఈ బిల్లు కు వైఎస్సార్‌సీపీ పూర్తి మద్దతును ప్రకటించి తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని మరో సారి పార్లమెంటు సాక్షిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాటుకున్నారన్నారు.



మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగంలో కొత్త నియామకాలు


గొరుసు మహేశ్వరరెడ్డి | జి.వాసుదేవ రావు | ఎ.ఎస్.వి.అంజనీ కుమార్ | మాతాని సింహా చలంనాయుడు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్ సీపీ న్యాయవిభాగం జిల్లా జోనల్ ఇన్‌చార్జిలుగా గొరుసు మహేశ్వరరెడ్డి(విశాఖ), జి.వాసుదేవరావు (శ్రీకాకుళం)ను నియమిస్తూ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే, విజయనగరం జిల్లా న్యాయవిభాగం జిల్లా అధ్యక్షునిగా ఎ.ఎస్.వి.అంజనీకుమార్, పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షునిగా మాతాని సింహాచలం నాయుడును నియమిస్తూ ఆదేశాలు జారీచేసింది. వీరి నియామకంపై వైస్సార్ సీపీకి చెందిన ఉమ్మడి జిల్లాల న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యక్తి ఆత్మహత్య

బొబ్బిలి: మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన ఉంగట్ల రామకృష్ణ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బైక్ కొనే విషయమై భార్యతో గొడవ పడి మనస్తాపం చెంది గడ్డిమందు తాగేశాడు. కుటుంబసభ్యులు గమనించి విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹136	₹242	₹ 252

నేర నియంత్రణకు కొత్త సర్కిల్స్

శృంగవరపుకోట: గతంలో కన్నా ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాల్లో పెరుగుతున్న క్రైమ్‌రేటు, క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు జిల్లాలో కొత్తగా సర్కిల్స్‌ను ఏర్పాటు చేయనుంది.

అదనంగా మూడు సర్కిల్స్

ప్రస్తుతం జిల్లాలో కొత్తగా మరో మూడు సర్కిల్స్ ఏర్పాటుకు పోలీస్‌శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కేసుల సంఖ్య పెరిగి, పెండింగ్‌లో ఉండడం, సిబ్బంది కొరత, సర్కిల్ పరిధి ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఎంపిక చేసి, అటువంటి ప్రాంతాల్లో సీఐ కమ్ ఎస్‌హెచ్‌ఓ సర్కిల్స్ ఏర్పాటు చేసే యోచన చేస్తోంది. భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రస్తుతం భోగాపురం, విజయనగరం రూరల్, ఎస్.కోట స్టేషన్‌లను ప్రత్యేక సర్కిల్స్‌గా గుర్తించే ప్రతిపాదనలు డీఐజీ కార్యాలయానికి చేరాయి.

నేరాల అదుపే లక్ష్యం

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటు కానుండడం, వీఐపీల తాకిడి, పెట్రోలింగ్, ప్రొటోకాల్ డ్యూటీల వంటి ఇబ్బందుల్ని అధిగమించాల్సిన అవసరం ఉంది. ఎస్‌కోటలో కేసుల తాకిడి పెరగడంటం, ఇటీవల మన్యం నుంచి వస్తున్న అక్రమ గంజాయి వల్ల పెరిగిపోతున్న ఎన్‌డీపీఎస్ కేసులు ఎస్.కోట సర్కిల్‌కు తలకు మించిన భారం అవుతున్నాయి. విజయనగరం రూరల్ ప్రాంతం పరిధిబాగా విస్తృతంగా ఉండడం, అర్హత ఉన్న సీఐ స్థాయి అధికారులకు ప్రమోషన్స్ ఇవ్వడం, వర్క్ డివిజన్, వర్క్ ఫోకస్, రెస్పాన్సిబిలిటీ పెంచడం, పరిధి తగ్గించడం ద్వారా కేసుల సత్వర పరిష్కారం సాధ్యమవుతుందన్న ఆలోచనలో పోలీస్‌శాఖ ఉంది.

పరిశీలనలో ఉన్నాయి



కేసుల తీవ్రత, పెరిగిన క్రైమ్‌రేట్, సిబ్బంది కొరత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎస్.కోట, విజయనగరం రూరల్, భోగాపురం సర్కిల్స్ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. –ఎస్పీ దీపికాపాటిల్

మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల

సాలూరు, పార్వతీపురం మన్యం జిల్లా

రేఖాసంఖ్య :01/టెండర్లు/2023-24. తేది : 21/09/2023

టెండర్ ప్రకటన

పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించబడుతున్న 1.మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, సాలూరు (బాలికలు). 2. పార్వతీపురం(బాలికలు) 3.కురుపాం (బాలురు) పాఠశాలలకు 2023-24 విద్యా సంవత్సరమునకు ఈ దిగువ వివరించిన సామాగ్రి సరఫరా చేయుటకు బహిరంగ సీల్డ్ టెండర్లు కోరడమైనది.

1.కూరగాయులు 2.పండ్లు 3. కోడి మాంసము (బాయిలర్) 4.కోడి గుడ్లు ఆయా పాఠశాల కార్యాలయపు పనివేళల్లో తగిన రుసుము చెల్లించి తేది.22.09.2023 నుండి 29.09.2023 వరకు టెండర్ ఫారాలను పొందవచ్చును. పూర్తిచేసిన సీల్డ్ టెండర్ ఫారములు తేదీ.29.09.2023 సాయంత్రం 5 గంటల్లోగా ఆయా పాఠశాలల్లో గల టెండర్ పెట్టెలో వేయవలెను. సీల్డ్ టెండర్లు తేదీ.04.10.2023 నాడు శ్రీయుత జాయింట్ కలెక్టర్ వారి కార్యాలయంలో, వారి సమక్షంలో తెరవబడును. టెండర్లు రద్దు పరుచుటకు, మార్పు చేయుటకు శ్రీయుత జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఛైర్మన్ జిల్లా కొనుగోలు కమిటీ పార్వతీపురం మన్యం జిల్లా వారికి అధికారం కలదు. మిగతా వివరములకు కన్వీనర్ ప్రిన్సిపాల్ సాలూరు వారిని సంప్రదించి తెలుసుకోగలరు.

సం/- కన్వీనర్ ప్రిన్సిపాల్

ఎం.జె.పి.ఎ.పి.బి.సి.డబ్ల్యు, గురుకుల పాఠశాల (బాలికలు) సాలూరు.

ఫోన్ నెంబర్ : 8179811080

సాక్షి క్లాసిఫైడ్స్

FREE TRAINING

■ పేద అమ్మాయిలకు, హైదరాబాద్, కూకట్‌పల్లిలో, HR+మీడియా+ డిజిటల్+ కంప్యూటర్‌లో 120డేస్ ఫ్రీ ట్రైనింగ్+ఫ్రీ-వసతి+ఫ్రీ-ప్లేస్‌మెంట్+భవిష్యత్తు+ఆదాయం. Q: డిగ్రీ+ స్మార్ట్ ఫోన్ మస్ట్. ఫోన్ : 9908743603 [HA-2547]

PLOT FOR SALE

■ బైక్ ఫ్రీ : VZM - రాయపూర్ రోడ్, 5th బెటాలియన్ ఎదురుగా, హైవేకి 2 మినిట్స్. రేడీ టు కన్‌స్ట్రక్షన్ VMRDA ప్లాటు కొనుగోలుపై రూ॥ 80,000/- విలువైన E- బైక్ ఫ్రీ. భోగాపురం, ఆనందపురంలలో ప్లాట్లు కలవు. ఫోన్ : 73308 11149 [V-2850]

HOUSE FOR SALE

■ సాయి గోల్డెన్ వెంచర్స్ వారి వినాయక చవితి శుభాకాంక్షలు. విజయనగరం లోకల్‌లో ఇండిపెండెంట్ 2 BHK ఇల్లు కేవలం 35 లక్షలు మాత్రమే. Call: 9391873337 [S-1191145]

WANTED

■ రిటైర్డ్, వి.ఆర్.ఎస్, సీనియర్ సిటిజన్స్ డిఫెన్స్ (R), హౌస్‌వైవ్స్ (45Y), ఫ్రీలాన్సర్స్ జాబ్, బ్యాకింగ్ రంగంలో (VSP), వారంలో ఒక రోజు హాజరు మిగతా రోజులు ఇంటివద్దనే, కనీస విద్యార్హత : 10th పాస్, ఫిక్స్‌డ్ శాలరీ PF, ESI, ఇన్సెంటివ్స్, ఇంటర్నేషనల్ కన్వెన్షన్. కాంటాక్ట్ : 8886339797 [S-1191161]

■ Wanted teachers to teach Telugu, English and Hindi for primary classes. Sri Saraswati vidhya niketan Dharmapuri, vzm. ph.9492620207 [S-1220338]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221708]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221639]

■ రామకృష్ణ గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 8639756219, 8639756226 [B-1068118]

■ MS కంపెనీ నందు పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ వర్క్ చేయుటకు టెలికాలర్స్ కావలెను. మేల్/ఫీమేల్. Qly: 10th జీతం: 16,000 18,000. ఫోన్ 8499028319, 7416297427 [HA-632]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీతం: 18K. హైదరాబాద్: 9640258899, విజయవాడ: 9640648899 [HA-631]

■ వైజాగ్‌లో ఫుడ్, రూమ్ సదుపాయంతో మా షాపింగ్ మాల్ గోడౌన్స్ (Ware House) నందు పనిచేయుటకు 19-35 వయస్సు గల యువకులు కావలెను. నెల జీతం : 10,000/-. ఫోన్ : 97046 37370, 97051 94330 [V-26453]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.